
ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 27 జనవరి 2024



- గుంటూరు ఛానల్ భూసేకరణ వేగవంతం
- ఒక జిల్లా ఒక ఉత్పత్తిలో అవార్డు గర్వకారణం
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా రిపబ్లిక్ డే వేడుకలు
- ఆకట్టుకున్న శకటాలు.. అలరించిన విద్యార్థుల నృత్యాలు



అభివృద్ధి దిశగా అడుగులు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరీఫ్ జేసీ రాజకుమారి, డీఆర్‌ఓ చంద్రశేఖర్





పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తోందని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు అట్టహాసంగా జరిగాయి. తొలుత జాతీయ జెండాను కలెక్టర్ ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వివిధ రంగాల్లో జిల్లా సాధించిన ఫలితాలను కలెక్టర్ వివరించారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి విభాగంలో జిల్లాకు జాతీయ స్థాయి చేనేత జౌళి శాఖ అవార్డు రావడం గర్వకారణమన్నారు. జలయజ్ఞంలో భాగంగా గుంటూరు ఛానల్ పొడిగింపు ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియ ప్రారంభించి వేగవంతం చేశామన్నారు. జిల్లాలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇప్పటి వరకు 16,688 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామని తెలిపారు. 209 లేఅవుట్లలో 67,258 ఇళ్లు మంజూరు చేశామని, ఇందుకోసం రూ.1,514.55 కోట్లు కేటాయించామన్నారు. మౌలిక సదుపాయాలకు రూ.88.98 కోట్లు కేటాయించి పనులు చేయిస్తున్నామన్నారు. మిచౌంగ్ తుపాను వల్ల కురిసిన అధిక వర్షాలకు పంట నష్టపోయిన 39,780 మంది రైతులకు రూ.47.29 కోట్ల పెట్టుబడి రాయితీ కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఉద్యాన పంటలు నష్టపోయిన 12,993 రైతులకు రూ.14.44 కోట్ల పెట్టుబడి రాయితీ కోసం ప్రతిపాదించామన్నారు. తడిసిన ధాన్యం 139 మంది రైతుల నుంచి 1,414 టన్నులు కొనుగోలు చేసి రూ.2.54 కోట్లు చెల్లించామన్నారు. 2023-24లో ఇప్పటివరకు 320 సూక్ష్మ, చిన్న పరిశ్రమల ద్వారా రూ.34.45 కోట్ల పెట్టుబడితో 725 మందికి ఉపాధి కల్పించామన్నారు. ఐడీపీ కింద 203 యూనిట్లకు రూ.22.56 కోట్ల రాయితీలు ఇచ్చామన్నారు. పీఎంఈజీపీ కింద 137 యూనిట్లకు రూ.8.82 కోట్లతో సబ్సిడీ అందించామన్నారు.



సాంస్కృతి కార్యక్రమంలో మొదటి బహుమతి సాధించిన శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ అధికారులు

శకటాల.. సాంస్కృతిక ప్రదర్శనలు

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరిస్తూ శకటాల ప్రదర్శన కొనసాగింది. శకటాల పరేడ్‌ను కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. దేశభక్తి ప్రబోధంగా విద్యార్థుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతలను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యాలు చేశారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను కీర్తిస్తూ, దేశభక్తిని చాటేలా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో శ్రీవెంకటేశ్వర బాలకుటీర్‌కు మొదటి బహుమతి, సెయింట్ జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాలకు ద్వితీయ బహుమతి, శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు తృతీయ బహుమతిని కలెక్టర్ అందించారు. శకటాల ప్రదర్శనలో జిల్లా రవాణాశాఖకు మొదటి బహుమతి, జాతీయ ఓటర్ల దినోత్సవం(రెవెన్యూ శాఖ)కు ద్వితీయ బహుమతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ సంక్షేమ శాఖకు తృతీయ బహుమతి అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి, స్వచ్ఛంధసేవా సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు.

ప్రభుత్వ శాఖల స్టాళ్ల ఏర్పాటు

పరేడ్ గ్రౌండ్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన, అటవీ, పర్యాటకశాఖ, నగరపాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామీణాభివృద్ధి, వైఎస్సార్ క్రాంతి పథకం, ఉద్యాన, జిల్లా నైపుణ్యాభివృద్ధి, రహదారులు, భవనాల శాఖ, సర్వే మరియు భూ రికార్డుల శాఖ, లీడ్ బ్యాంక్ - నాబార్డు సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ శాఖ, జిల్లా వైద్యారోగ్యశాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, మత్స్య, పశు సంవర్ధక శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్ పరిశీలించారు. డీఆర్డీఏ - వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా 18,263 డ్వాక్రా సంఘ సభ్యులకు స్త్రీ నిధి ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.103.34 కోట్ల చెక్కును కలెక్టరు లబ్ధిదారులకు అందించారు. ఏపీఎంఐపీ శాఖ మంజూరు చేసిన స్ప్రింక్లర్లు, స్ప్రేయర్ల మంజూరు పత్రాలను, వృత్తి విద్యా నైపుణ్యాలలో శిక్షణ పొందిన నిరుద్యోగులకు సర్టిఫికెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, శాసనమండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, లక్ష్మణరావు, ఏఎస్పీ సుప్రజ, డీఆర్వో చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి సాధించిన రవాణా శాఖ శకటం



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వైసీపీ ముఖ్య నేతలు.. టీడీపీలోకి..

- పార్టీని వీడుతున్న దుగ్గిరాల వైసీపీ ముఖ్య నాయకులు
- లోకేశ్ సమక్షంలో చేరికలు
- రెట్టించిన ఉత్సాహంతో టీడీపీ క్యాడర్

6 లో..

సర్వజనులకు క్రీస్తు ఆశీస్సులు

- జె.శామ్యూల్ కిరణ్
- 86వ బైబిల్ మిషన్ మహోత్సవాలు ప్రారంభం
- తరలివచ్చిన భక్తులు

పెదకాకాని, జనవరి 26: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ.. సకల జనులకు ఏసుక్రీస్తు ప్రభువు ఆశీర్వాదం లభించాలని ఏకైక లక్ష్యంతో బైబిల్ మిషన్ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ తెలిపారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యం ఎదుట గల సువిశాల ప్రాంగణంలో బైబిల్ మిషన్ మహోత్సవాలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఏసుక్రీస్తు బోధనలైన ప్రేమ, శాంతి, కరుణ, క్షమాపణ వంటి ఉత్తమ గుణాలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. ఈ మహోత్సవాలను ఇదే ప్రాంతంలో 1995 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, బీహార్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి లక్షలమంది భక్తులు మహోత్స వాలకు హాజరయ్యారు. తొలిరోజు శుక్రవారం బైబిల్ మిషన్ ఉపాధ్యక్షులు పి.జాన్ దేవదాస్, కార్యదర్శి కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రెటరీ డి.సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.రవి, గవర్నింగ్ బాడీ సభ్యులు సమావేశం వద్దకు చేరుకున్నారు. జె.వినోద్‌కుమార్, డి.శామ్యూల్ కిరణ్, డి.సుధాకర్, కె.బాబు దేవదాస్, షాలోమ్ శరత్ తదితరులు వాక్యోపదేశం చేశారు. భక్తి గీతాలను చెన్నై, న్యూ గుంటూరు సంగీత బృందం ఆలపించారు. భక్తు లకు భోజన ఏర్పాట్లను చేశారు.





బైబిల్ మిషన్ మహోత్సవాల్లో వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్లు, హాజరైన భక్తులు

రెండు వేలిముద్రలతోనే.. రేషన్

- లేదంటే సరుకుల పంపిణీ లేదు
- ఈ నిబంధనతో సర్వర్ మొరాయింపు
- నష్టపోతున్న ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత చట్టం(ఎన్ఎఫ్ఎస్ఏ) కింద మంజూరైన రేషన్‌కార్డుదారులకు బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేయడానికి రెండు వేలిముద్రల నిబంధనని ప్రభుత్వం అమలుచేస్తున్నది. దీనివల్ల ఈ-పోస్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ ఆపరేటర్లు మొత్తుకొంటున్నారు. ఒక వేలిముద్రని అధీకృతం చేయడానికే సర్వర్ ఎక్కువ సమయం తీసుకొంటున్నదని, అలాంటిది రెండుసార్లు వేలిముద్రలు అంటే మరింత జాప్యం అవుతున్నదని వాపోతున్నారు. దీని వల్ల తమపై పనిభారం కూడా పెరిగిందని వారు చెబుతున్నారు. అంతేకాకుండా సకాలంలో కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయలేకపోతున్నామంటున్నారు. రేషన్‌కార్డుల లో కేంద్ర ప్రభుత్వం ఎన్ఎఫ్ఎస్ఏ కింద ఇచ్చినవి, రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా మంజూరు చేసినవి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కార్డులకు సంబంధించి ఒక వేలిముద్ర వేస్తే బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు, గోధుమ పిండి పంపిణీ చేస్తున్నారు. ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులు వచ్చేసరికి బియ్యానికి ఒకసారి వేలి ముద్ర, రెండోసారి వేలిముద్ర ఆమోదం జరిగిన తర్వాతనే ఇతర సరుకులు ఇస్తున్నారు. దీని వల్ల ఎండీయూ ఆపరేటర్లకు సరుకులు పంపిణీ చేయడానికి ఎక్కువ సమయం పడుతున్నది. ఫలితంగా ఒక్కో ఆపరేటర్ తనకు కేటాయించిన రేషన్ దుకాణాల పరిధిలో సరుకులు పంపిణీ పూర్తి చేయడానికి 15 నుంచి 20 రోజుల వ్యవధి అవసరం అవుతున్నది.



ఎందుకీ వ్యత్యాసం?

గతంలో ఎన్ఎఫ్ఎస్ఏ/నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ అన్న వ్యత్యాసం లేకుండా అందరికీ ఒకసారి వేలిముద్ర వేయించుకుని సరుకులు పంపిణీ చేసేవారు. కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇలా ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులతో రెండుసార్లు వేలిముద్రలు వేయించాలన్న నిబంధనని వైసీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. రెండోసారి వేలిముద్ర పడకపోతే ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులు కందిపప్పు, చక్కెర, గోధుమపిండి వంటి సరుకులు వదులుకోవాల్సి వస్తున్నది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి రెండు వేలిముద్రల నిబంధనని తీసేయించాలని ఎండీయూ ఆపరేటర్లు జిల్లా అధికారులకు మొర పెట్టుకున్నారు. అయితే ఇంతవరకు వారి ఇబ్బందులు తొలగలేదు.

గుంటూరా.. గుంతలూరా..

- రోడ్ల దుస్థితిపై షర్మిల సెటైర్లు
- కాంగ్రెస్ వస్తే హోదాపైనే తొలి సంతకం
- ఏపీసీసీ చీఫ్‌కు శ్రేణుల ఘన స్వాగతం.. ర్యాలీ
- షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ నేతలు

గుంటూరు, జనవరి 26: 'ఇది గుంటూరా.. గుంతలూరా.. రోడ్లు వేసేందుకు డబ్బుల్లేవు..' అంటూ గుంటూరు నగర రహదారుల దుస్థితిపై ఏపీసీసీ చీఫ్ షర్మిల సెటైర్లు వేశారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం గుంటూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుంటూరు ఎన్‌జీవో కాలనీలోని మెట్టు అంజిరెడ్డి ఫంక్షన్ హాల్లో కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షర్మిల ప్రసంగిస్తూ ఉద్యోగులకు కనీసం జీతాలిచ్చేందుకు కూడా డబ్బుల్లేని పరిస్థితికి రాష్ట్రాన్ని వైసీపీ పాలకులు తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాల్లేక అల్లాడిపోతున్నారన్నారు. రాష్ట్రంతో పాటు అందరి భవిష్యత్ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైన్యంగా మారాలన్నారు. బూత్‌స్థాయిలో కమిటీలు వేసి పార్టీకి పూర్వవైభవం దిశగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలి సంతకం రాష్ట్రానికి ప్రత్యేక హోదా పైనే అని తెలిపారు. కాంగ్రెస్ రాకపోతే ప్రత్యేక హోదా, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ వంటి పథకాలు రావని కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 2014 నుంచి ఇప్పటి వరకు ఉన్న రెండు ప్రభుత్వాలు ప్రజల్ని మోసం చేశాయని విమర్శించారు. షర్మిల కాంగ్రెస్‌లోకి రాకముందు వైసీపీ నేతలు వై నాట్ 175 అన్నారని, ఇప్పుడు షర్మిల రాకతో దేముడి దయ ఉంటే అధికారంలోకి వస్తామంటున్నారన్నారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలి మహిళా సీఎంగా షర్మిల అవటం ఖాయమన్నారు. కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జరిగే మేలుపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. ఆంధ్రలో మార్పు రావాలి, కాంగ్రెస్ కావాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. అనంతరం వైసీపీ ఎస్సీ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, చీరాలకు చెందిన వైసీపీ నాయకుడు శ్యామ్‌లకు కాంగ్రెస్ కండువాతో షర్మిల పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, కొప్పుల రాజు, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు షేక్ మస్తాన్‌వలి, సుంకర పద్మశ్రీ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు తాంతియాకుమారి, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా, గుంటూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, గంటా అంజిబాబు, అలెగ్జాండర్ సుధాకర్, షేక్ ఉస్మాన్, ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నేతలు మదన మోహన్ రెడ్డి, సయ్యద్ జబీవుల్లా, బాదినేడి కిషోర్, నూనె పవన్‌తేజ, కరిముల్లా, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న వైఎస్ షర్మిల



వైఎస్ షర్మిలకు కార్యకర్తలు ఘన స్వాగతం పలుకుతూ ర్యాలీ



బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాజ్యాంగం అంటే ఈ ప్రభుత్వానికి గౌరవం లేదు

● 1501 వ వరోజు రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 26: భారత రాజ్యాంగం అమలు జరగిన రిపబ్లిక్ డే రోజున కూడా రైతులకు విముక్తి లేదని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు భూములిచ్చిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం ఒప్పందం చేసుకొని రాజధాని నిర్మాణం కోసం ప్రభుత్వానికి భూములిచ్చామన్నారు. చట్ట వ్యతిరేకంగా అమరావతిని కాదని, మూడు రాజధానులని సీఎం జగన్‌రెడ్డి ప్రకటన చేయటం అప్రజాస్వామికమన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1501వ రోజుకు చేరుకున్నాయి. రిపబ్లిక్ డే సందర్భంగా తుళ్లూరు రైతు ధర్నా శిబిరం వద్ద త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. తెల్లదొరల మాదిరిగా సీఎం జగన్‌రెడ్డి పాలన చేస్తున్నాడన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, ఉద్దండ్రాయునిపాలెం, వెలగపూడి తదితర రాజధాని గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

● మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ

కొల్లిపర, జనవరి26: గుంటూరు పార్లమెంట్ పరిధిలో పొన్నూరు నియోజకవర్గం వడ్లమూడిలో ఈనెల 29వతేదీన జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, తెనాలి నియోజకవర్గ పరిశీలకుడు కొనకళ్ల నారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని పిడపర్తిపాలెంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు బొల్లు యోగానందచటర్జీ, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని దించేందుకు.. రా కదలిరా

● బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరం ● ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



వడ్లమూడిలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నరేంద్ర కుమార్, టీడీపీ, జనసేన కీలక నాయకులు

చేబ్రోలు, జనవరి 26: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత నారాచంద్రబాబు నాయుడు రా కదలి రా సభలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండలంలోని వడ్లమూడి గ్రామంలో ఈ నెల 29వ తేదీన జరగనున్న రా కదలిరా బహిరంగ సభ ప్రాంగణాన్ని శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులు పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ క్వారీ బాల కోటేశ్వరస్వామి ఆశీస్సులతో సభా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఓటమి తప్పదని గ్రహించిన జగన్‌మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలకు దిగారని ఆరోపించారు. కుల మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని అన్నారు. సత్తెనపల్లిలో మనిషి చనిపోతే ఇచ్చే పరిహారంలో కూడా మంత్రి రాంబాబు కమీషన్ తీసుకునే స్థాయికి దిగజారారని దుయ్యబట్టారు. పొన్నూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పెద్దఎత్తున గ్రావెల్ దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అభివృద్ధిని శూన్యం చేసారన్నారు. రా కదలిరా సభలో చంద్రబాబు సంధిస్తున్న ప్రశ్నలతో పాలకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే అజెండాగా టీడీపీ, జనసేన పొత్తు సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రత్తిపాడు ఇన్‌చార్జి బి .రామాంజనేయులు మాట్లాడుతూ జగన్‌కు అన్ని వర్గాల ప్రజలు గుణపాఠం చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాట్స్ మాజీ అధ్యక్షుడు మన్నవ మోహన కృష్ణ, గుంటూరు తూర్పు ఇన్‌చార్జి నసీర్ అహ్మద్, పోతినేని శ్రీనివాస్, సుఖవాసి శ్రీనివాసరావు తదితర టీడీపీ నాయకులతో పాటు నాయిబ్ కమల్, చెందు శ్రీరాములు, వల్లంశెట్టి శ్రీధర్, ఎర్రసాని నాగభూషణం తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సభా ప్రాంగణానికి ఎన్‌టీఆర్ పేరు..

ఈ నెల 29వ తేదీన వడ్లమూడిలో జరిగే రా కదలి రా బహిరంగ సభా ప్రాంగణానికి ఎన్టీఆర్ సభా ప్రాంగణంగా టీడీపీ, జనసేన నాయకులు పేరు పెట్టారు. సభా వేదిక కోసం సుమారు మూడెకరాలు, హెలిప్యాడ్ కోసం 2.50 ఎకరాలు, ప్రజలు సభా ప్రాంగణంలో ఆశీనులయ్యేందుకు 25 ఎకరాలు భూమిని ఇప్పటికే చదును చేశారు. వీఐపీ గ్యాలరీలు, హెలిప్యాడ్ ఏర్పాట్ల పనులను శుక్రవారం ప్రారంభించారు. సభావేదిక ప్రాంగణానికి ఉన్న పలు రహదారుల్లో వాహనాలు పార్కింగ్ చేసుకునేలా సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను నరేంద్ర కుమార్ దగ్గర ఉండి పరిశీలిస్తున్నారు.

వైసీపీ ముఖ్య నేతలు.. టీడీపీలోకి..

● పార్టీని వీడుతున్న దుగ్గిరాల వైసీపీ ముఖ్య నాయకులు
● లోకేశ్ సమక్షంలో చేరికలు
● రెట్టించిన ఉత్సాహంతో టీడీపీ క్యాడర్



పాటిబండ్ల కృష్ణప్రసాద్ | యేళ్ల జయలక్ష్మి | యడ్ల వెంకట్రావు | కొరిటాల సురేష్ | పాటిబండ్ల హరిప్రసాద్ | కొండూరు ముత్తయ్య

దుగ్గిరాల, జనవరి 26: మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలానికి చెందిన వైసీపీ ముఖ్యనేతలు టీడీపీలో చేరేందుకు సిద్ధం అయ్యారు. వైసీపీలోని కొందరు నాయకులు ఇప్పటికే టీడీపీలో చేరారు. వైసీపీ కీలక నేత విజయసాయిరెడ్డి మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి ఇంటికి వచ్చి వైసీపీలోనే కొనసాగాలని కోరినప్పటికీ తమ నిర్ణయం మార్చుకునే ప్రసక్తే లేదని ముఖానే చెప్పేయడం ఆ పార్టీ నాయకులకు మింగుడు పడడం లేదు. తాజాగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా 14 ఏళ్ల పాటు కొనసాగి, జడ్పీటీసీగా 80 ఏళ్ల వయస్సులో విజయం సాధించి ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్న సీనియర్ నాయకులు, చిలువూరు గ్రామానికి చెందిన యడ్ల వెంకట్రావు(పెద్దాయన) టీడీపీలో చేరనున్నారు. చిలువూరు గ్రామ మాజీసర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మితో పాటు, పెదపాలెం సర్పంచ్, దుగ్గిరాల యార్డు మాజీ చైర్మన్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, గత 18 ఏళ్లగా దుగ్గిరాల సొసైటీ చైర్మన్‌గా కొనసాగుతున్న వైసీపీ ముఖ్యనాయకుడు పాటిబండ్ల హరిప్రసాద్, మార్కెట్ యార్డు మాజీచైర్మన్ కొండూరు ముత్తయ్య, పెనుమూలి సొసైటీ చైర్మన్ కొరిటాల సురేష్, తుమ్మపూడికి వైసీపీ ముఖ్యనాయకుడు వాసిరెడ్డి లీలాప్రసాద్‌లు కూడా శనివారం మధ్యాహ్నం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పార్టీ కండువా వేసుకోనున్నారు. శృంగారపురం సర్పంచ్ సుధారాణి, పెనుమూలి సర్పంచ్ కొరిటాల పద్మావతి, మాజీసర్పంచ్ కొరిటాల సురేష్, పేరుకలపూడి, శృంగారపురం, కేఆర్‌కొండూరు, వీర్లపాలెం, గొడవర్రు, పెదకొండూరు తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు సైతం వారి ముఖ్య అనుచరులతో కలిసి టీడీపీలో చేరనున్నారు.

అభివృద్ధి కనుచూపుమేరలో కానరాకనే..

వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి మచ్చుకైనా ప్రజలకు చూపలేకపోయారని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యేళ్ల జయలక్ష్మి అన్నారు. వైసీపీని వీడి విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు నాయకత్వంలో భవిష్యత్ ప్రయాణాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రాజకీయ ప్రాధాన్యం ఉన్న కుటుంబంలో నుంచి వచ్చానని, తాత యడ్ల సాంబయ్య, మామ నాగేశ్వరరావులు సర్పంచ్‌లుగా విలువలతో పనిచేశారని, వారి స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. వైసీపీలో ఉంటూ అవమానాలు ఎదుర్కొన్నామని, గ్రామాల్లో అభివృద్ధి లేకపోవడం, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు సైతం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోవడం ఇష్టం లేకనే పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. పార్టీకోసం అవమానాలు దిగమింగుకుని పార్టీకోసం పనిచేస్తున్నప్పటికీ తమ మాటకు విలువలేకుండా పోయిందన్నారు. ప్రజల్లోకి వెళ్లి అభివృద్ధి గురించి మాట్లాడలేని పరిస్థితి నెలకొందన్నారు. నాలా ఇంకా ఎంతోమంది అన్నీ దిగమింగుకుని కొనసాగుతున్నారన్నారు.

ఎలాంటి నిధుల మంజూరు లేదు..

పరిసర పదిగ్రామాల్లో తిరుగులేని నాయకుడిగా ఎదిగిన పెదపాలెం ప్రస్తుత సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, దుగ్గిరాల నియోజకవర్గం ఉండగా అప్పటి ఎమ్మెల్యే వెంకటరెడ్డి నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తొలుత ఎంపీటీసీగా గెలుపొందానని, 2001, 2007 పెదపాలెం గ్రామసర్పంచ్‌గానూ, 2005లో మార్కెట్‌యార్డు చైర్మన్‌గానూ కొనసాగానన్నారు. తమ కుటుంబం నుంచి పాటిబండ్ల ధనలక్ష్మి ఎంపీటీసీగాను గెలుపొందారని, ప్రజల్లో టీడీపీ పట్ల పెరుగుతున్న ఆదరణతోనే ఆ పార్టీలో చేరుతున్నామన్నారు.

18 ఏళ్లుగా దుగ్గిరాల సొసైటీ చైర్మన్‌గా..

మండలంలో 14గ్రామాలకు ఒకే సొసైటీగా ఉన్న దుగ్గిరాల సొసైటీకి 18ఏళ్లుగా చైర్మన్‌గా కొనసాగుతున్న పాటిబండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ లోకేశ్ మంగళగిరిలో ఓటమి చెందినప్పటికీ ప్రజల మధ్యే ఉంటూ పేదలు, బడుగులకోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి టీడీపీ చేరాలని నిర్ణయించుకున్నానన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

దుర్గి, జనవరి 26: మండలంలోని అడిగొప్పులలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీకి చెందిన సుమారు 100 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. వీరిని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గమంతా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బ్రాండ్ పేరుతో మద్యం విచ్చలవిడిగా నడుస్తోందని ఆరోపించారు. కొండలు, గుట్టలను కొల్లగొడుతూ అక్రమ సంపాదన చేస్తున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ పిన్నెల్లి సోదరులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నా ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ సుమారు 100కు పైగా సంక్షేమ పథకాలు ఎత్తివేశారన్నారు. సొంత చెల్లిని, తల్లిని దుర్మార్గంగా బయటకు పంపిన కఠినాత్ముడని, అలాంటి వారి మాయమాటల్లో మరలా పడితే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రామకృష్ణారెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. గుక్కెడు నీరు కూడా ఇవ్వని అసమర్థుడు ఈ ఎమ్మెల్యే అన్నారు. తాము అధికారంలోకి రాగానే చర్రి పునరుద్ధరణ చేస్తానని, నీటి ట్యాంకరు ఏర్పాటు చేసి నీటిని అందించడంతోపాటు ఎస్సీ, ఎస్టీ కాలనీలో సైడు కాలువలతోపాటు సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీనిచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని, ఇబ్బందులు పడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

35 మంది ఎంపీడీవోల బదిలీలు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 35 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు పంచాయతీరాజ్ శాఖ బదిలీ చేసింది. కృష్ణా జిల్లాకు షేక్ మెహబూబ్ సుభాని, జి.చంద్రశేఖర్‌రావు, డి.రాంబాబు, ఐ.సత్యన్నారాయణ, ఎన్.నాగలక్ష్మి, బి.మారుతిశేషమాంబ, కె.శివపార్వతి, ఎ.శ్రీరమ్య, ఎ.దీప్తి, పి.ఉమాదేవి, ఎన్.వెంకటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావులను బదిలీ చేసింది. ప్రకాశం జిల్లాకు బి.బాబురావు, పీజే విలియమ్స్, పి.శివసుబ్రహ్మణ్యం, షేక్ గౌసియాబేగం, కె.సమతవాణి, వై.హనుమరెడ్డి, ఫణికుమార్ నాయక్, యూబీ వరప్రసాద్, పి.పుట్టారెడ్డి, పీఎస్ పద్మాకర్, బి.శ్రీనివాసరెడ్డి, కె.నరసింహారావు, జి.కాశయ్య, కె.మాధ్యూబాబు, జీవీ సత్యన్నారాయణ, పి.సీతారామయ్య, ఎం.శ్రీదేవి, టి.సుగుణమ్మ, వి.విజయలక్ష్మి, ఎం.శోభారాణి, వై.రాజగోపాల్, వై.మహాలక్ష్మి, బి.మహేష్‌బాబులను బదిలీ చేసింది.

మేఘాలయపై ఉత్తరప్రదేశ్ రికార్డు విజయం



అల్మాస్ భరద్వాజ్

మంగళగిరి సిటీ, జనవరి 26: మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం నుంచి బీసీసీఐ అండర్-23 మహిళల వన్డే క్రికెట్ టోర్నీ గ్రూపు-డీ మ్యాచ్‌లు ఆరంభమయ్యాయి. తొలిరోజు మేఘాలయపై ఉత్తరప్రదేశ్ మహిళల జట్టు పది వికెట్ల తేడాతో రికార్డు విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మేఘాలయ జట్టు 28.4 ఓవర్లలో కేవలం 64 పరుగులు మాత్రమే చేసి ఆలౌటయింది. మేఘాలయ బ్యాటర్లు మ్యాన్సి, చియాంచి చెరో 16 పరుగులు చేయగా, ఉత్తరప్రదేశ్ బౌలర్ అల్మాస్ భరద్వాజ్ 8 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనతో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ జట్టు 7.4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 66 పరుగులు చేసింది. బబితా యాదవ్ అత్యధికంగా 26 పరుగులు చేసింది. తదుపరి మ్యాచ్ బరోడా, మేఘాలయ జట్ల మధ్య ఈ నెల 28వ తేదీన జరుగనుంది.

టీడీపీలో చేరిన కొలికపూడి శ్రీనివాసరావు



గుంటూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో శుక్రవారం పలువురు నేతలు పార్టీలో చేరారు. కొలికిపూడితో పాటు, కడప జిల్లా కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, ఆదోనికి చెందిన ఏసీ శ్రీకాంత్‌రెడ్డిని అధినేత చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో విధ్వంసకర పాలనకు చరమగీతం పాడేందుకు, టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని వారు ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్రం కోసం, యువత భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో తెలుగుదేశాన్ని గెలిపించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

పాత్రికేయులపై ఉపా చట్టం ప్రయోగించడం అప్రజాస్వామికం

● కేరళ ప్రముఖ పాత్రికేయుడు సిద్దిక్ కప్పన్



మాట్లాడుతున్న సిద్దిక్ కప్పన్, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 26: ప్రజల సమస్యలను, వాస్తవ దృక్కోణం నుండి ప్రపంచానికి తెలియజేయడమే నేరంగా భావించి తనపై "ఉపా"మనీ లాండరింగ్ కేసులు పెట్టారని ప్రముఖ కేరళ జర్నలిస్టు సిద్దిక్ కప్పన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు), ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట యుటిఎఫ్ హాలులో శుక్రవారం 'సిద్దిక్ కప్పన్'తో కొన్ని గంటలు అనే అంశంపై సభ నిర్వహించారు. సిద్దిక్ కప్పన్ మాట్లాడుతూ 28 నెలలు జైలులో ఉన్నామని, జైలులో దుర్భర పరిస్థితులు ఉన్నాయని, రాజ్యమే కాకుండా అధికారులు కూడా ఫాసిస్ట్ స్వభావాన్ని సంతరించుకుంటున్నారని వివరించారు.. ఇంత నిర్బంధ పరిస్థితుల్లోను దేశంలో అవగాహన పరిస్థితులు కనిపించాయని, పెరుగుతున్న నిర్బంధాన్ని, ఫాసిజాన్ని పౌర హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం కొన్ని సంఘాలు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. సభలో ప్రజా సంఘాల నాయకులు రమాసుందరి, విష్ణు, బి. పద్మ, రమేష్, పట్నాయక్, ప్రత్యూష సుబ్బారావు, యు. గనిరాజు, రెహానా, ఎం. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురజాలలో.. మెగా జాబ్‌మేళా

● యరపతినేని ఆధ్వర్యంలో ఏర్పాటు
● 2 వేల మందికి ఉద్యోగ అవకాశాలు



పిడుగురాళ్ల, జనవరి 26: గురజాల నియోజకవర్గానికి చెందిన యువతీ యువకులకు ఐటీ, నాన్ ఐటీ కంపెనీల ద్వారా సుమారు 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నేడు జరుగనుంది. గురజాల సమీపంలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేశారు. టెక్ మహీంద్ర, ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, హీరో, కాల్‌ఫర్‌జాబ్, ఎసెన్చర్, డిక్సాన్, డైఫిల్, హెటిరోఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, అపోలో, ఐసీసీఎస్, జయభేరి, యురేఖా తదితర కంపెనీలు కూడా జాబ్‌మేళాలో పాల్గొననున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలోనే సుమారు 1500 మందికి పైగా యువతీ యువకులు ఆన్‌లైన్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు వీలుగా సుమారు 40 గదులు ప్రత్యేక వసతులతో కేటాయించారు.

పల్నాడు యువతకు ఉద్యోగ భద్రతే లక్ష్యం : యరపతినేని

నాలుగున్నరేళ్లగా గురజాలలో వేలాది మంది యువతీ యువకులు డిగ్రీలు, పీజీ పట్టభద్రులై వున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు ఎటువంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదు. పల్నాడు వాసిగా ఇక్కడి యువతకు నేను చేతనైనంత వరకు ఉద్యోగ, ఉపాధి భద్రత కల్పించేందుకు కృషి చేస్తున్నా. నేను గురజాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాలో 2 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఫిబ్రవరిలో పిడుగురాళ్లలో మరో జాబ్‌మేళా నిర్వహించి మరికొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా వున్నా. అంతేకాకుండా గురజాల నియోజకవర్గంలో వున్న అనేక సిమెంట్ పరిశ్రమల్లో కూడా స్థానిక యువతకే ప్రాధాన్యం ఇచ్చేలా యాజమాన్యాలతో చర్చించి ఉద్యోగాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జగన్‌కు ఓటమి భయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, జనవరి 26: జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చిన జగన్ ఓటమి భయంలో ఉన్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నా వెంట్రుక కూడా పీకలేరు, నన్నే నమ్మండి, మిమ్మల్ని నమ్ముకున్నా అంటూ ఏటా ప్రజల్ని నమ్మించేందుకు ఊకదంపుడు ప్రకటనలు చేసి నేడు సంతోషంగా దిగిపోతానని జగన్‌రెడ్డి అనడం వెనుక పెద్దకారణం ఉందన్నారు. ఐదేళ్లలో ప్రజా వనరులను, ప్రజలను రూ.4 లక్షల కోట్లు దోచుకున్నారని, రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి నేడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రానివ్వకుండా తరిమి వేయడమే కాక, పెట్టుబడులు పెట్టే వారిని బెదిరించారని అన్నారు. ఒక్క చాన్స్ అని నమ్మి అధికారం ఇచ్చినందుకు ప్రజలంగా నష్టపోయి జగన్‌రెడ్డిని ఎప్పుడు గద్దె నుంచి ఇంటికి పంపుదామా అని ఎదురు చూస్తున్నారని తెలిపారు. నాణ్యమైన విద్యలో రాష్ట్రం 2018లో 3వ స్థానంలో ఉండగా ప్రస్తుతం 19వ స్థానానికి పడిపోయిందని కేంద్రం విడుదల చేసిన ఫౌండేషనల్ లెర్నింగ్ నివేదిక ప్రకారం బహిర్గతమైందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి అక్రమాలు, అరాచకాలు ప్రజలు ఎప్పుడో గుర్తించారని, వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి సరైన గుణపాఠం చెప్పాడం ఖాయమన్నారు.

లౌకిక, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

● ప్రజా, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 26: రైతులకు, కార్మికులకు, పేద ప్రజలకు నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలకు వ్యతిరేకంగా... రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ప్రజా, కార్మిక, రైతుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా వామపక్ష, పలు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమై పాత బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, పేరేచర్ల బస్టాండ్ మీదగా చుట్టుగుంట వరకు సాగింది. అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్లు, మోటార్ సైకిల్ వాహనాల ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వంనకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించినట్టు వివరించారు. కేంద్రం ప్రజాతంత్ర హక్కులను, రాష్ట్రాల హక్కులను హరిస్తుందని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని మండిపడ్డారు. మోదీ పాలనలో పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత 26% ఆత్మహత్యలు పెరిగాయని గుర్తుచేశారు. కార్మిక, కర్షకులు కలసి మోదీని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అధ్యక్షతను జరిగిన ఈ కార్యక్రమంలో కే వీవీ ప్రసాదు, పాశం రామారావు, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కళ్లం రాజశేఖరరెడ్డి, దండా లక్ష్మీనారాయణ, కాలువ శ్రీధరరావు, పాటిబండ్ల కోటేశ్వరరావు, బైరగాని శ్రీనివాసరావు, ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిజి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పోలీసు అధికారులు



జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పోలీసు అధికారులు



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్‌లో జాతీయ పతాకం ఎగురవేస్తున్న క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు షైనేని బ్రహ్మేశ్వర రావు, యాగంటి దుర్గారావు, పాలకవర్గ సభ్యులు వణుకూరి శ్రీనివాసరెడ్డి తదితరులు. - గుంటూరు.

హామీలు సాధించేవరకు పోరుబాటలోనే..

● సెర్ప్ జిల్లా జేఏసీ అధ్యక్షులు మూకిరి సుబ్బారావు
● కలెక్టరేట్ ఎదుట ప్రారంభమైన నిరసనలు

గుంటూరు(తూర్పు), జనవరి26: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఇచ్చిన ప్రతి హామీ సాధించేవరకు సమ్మెలోనే ఉంటామని రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) జిల్లా జేఏసీ అధ్యక్షులు మూకిరి సుబ్బారావు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సెర్ప్‌ఉద్యోగుల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ నవరత్నాలు ప్రజలకు చేరువ చేయడంలో సెర్ప్ కీలకపాత్ర పోషిస్తుందని, కానీ విధులు నిర్వహించే ఉద్యోగులను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా ఫిబ్రవరి 1వరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా కొనసాగుందని, అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తు కార్యచరణ రూపొందిం స్తామని స్పష్టం చేశారు. ధర్నాలో సంఘ ఉపాధ్యక్షులు ఏనుగోటి నరేంద్ర, సభ్యులు సుభాషిణి, రాజు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ షర్మిలకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

దళితుల 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారు

● జగనన్న విద్యాదీవెనకు పేరు తీసివేసి అంబేద్కర్ పేరు పెట్టాలి
● షర్మిలకు మాలమహానాడు నేతలు విజ్ఞాపన

గుంటూరు, జనవరి 26: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు అమలు చేసే 27 సంక్షేమ పథకాలను సీఎం జగన్ అధికారంలోకి రాగానే రద్దుచేశారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ విమర్శించారు. గుంటూరు పర్యటనకు విచ్చేసిన ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను అరుణ్‌కుమార్ ఆ సంఘం నాయకులు కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. అంబేద్కర్ విద్యాదీవెన పథకానికి అంబేద్కర్ పేరు తీసి జగనన్న పేరు పెట్టుకున్నారని, ఆయా పథకాలను తిరిగి పునఃప్రారంభించి పేర్లు కొనసాగించేలా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కృషి చేయాలని కోరారు.

భూ హక్కు చట్టం రద్దుకు కృషి చేయాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి

రాష్ట్రంలో సామాన్య ప్రజలకు, రైతులకు తీవ్ర విఘాతం కలిగించే భూ హక్కుచట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసేలా చర్యలుతీసుకోవాలని గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ ఇతర న్యాయవాదులు వైఎస్ షర్మిలకు విజ్ఞాపన పత్రం అందజేశారు.




ప్రమాణస్వీకారం చేస్తోన్న అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారోత్సవం

● ఆర్యవైశ్య సంఘీయుల ర్యాలీ.. నేతలకు ఘన స్వాగతం

గుంటూరు, జనవరి 26: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నూతన కార్యవర్గంతో పాటు, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ హాల్లో కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి టీజీ వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ ఇతర నేతలకు ఏటుకూరు రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి ఘన స్వాగతం పలికారు. అనంతరం సభలో గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా గుడివాడ వెంకటరవీంద్రకుమార్, కార్యదర్శిగా కోట శేషగిరి, ట్రెజరర్ బొలిశెట్టి పాపారావు, ప్రోగ్రామ్ కమిటీ ఛైర్మన్ అద్దేపల్లి శివసూర్యరాఘవేంద్రరావు, జాయింట్ సెక్రటరీ పరిటాల వెంకటేశ్వర్లు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్, అంబికా కృష్ణ, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, క్రేన్ గ్రూపు సంస్థల ఛైర్మన్ జీవీఎస్ఎల్ కాంతారావు, ఇతర ప్రముఖులు హాజరై ఆర్యవైశ్య సంఘీయులు సంఘటితంగా ఉంటూ హక్కులన సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్, కార్యక్రమ ఆహ్వాన కమిటీ ఛైర్మన్ ఈరంటి వరప్రసాద్ (సిటీబస్ బాబు), కొనకళ్ళ సత్యం, వలివేటి కృష్ణ, తల్లం కన్నా, కండే కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో లెఫ్టినెంట్ కల్నల్ వీ. పున్నారావు, మాజీ ఎంపీ డాక్టర్ శివాజీ, విష్ణు తదితరులు

పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో

ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 26: స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ (సీబీఎస్ఈ)లో 75వ గణతంత్ర దినోత్సవం, 2వ యానిమల్ ఇంటర్‌హౌస్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి లెఫ్టినెంట్ కల్నల్ వీ.పున్నారావు, పాఠశాల గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పద్మశ్రీ అవార్డ్ గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వర రావు(రైతు నేస్తం ఫౌండర్) పాఠశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. లెఫ్టినెంట్ కల్నల్ పున్నారావు జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమర యోధులు పాటిబండ్ల సీతారామయ్య విగ్రహానికి పుష్పమాలాలంకరణ చేశారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం మనది

● జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి
● నగరంలో వివిధ ప్రాంతాల్లో ఘనంగా గణతంత్ర వేడుకలు

గుంటూరు(కార్పొరేషన్) : ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం భారత దేశ రాజ్యంగమేనని, భారత పౌరులు రాజ్యాంగంలోని హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, ఎన్.టి.ఆర్.మున్సిపల్ స్టేడియంలో కమిషనర్ జాతీయ జెండా ఎగురవేసి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాలతో కలిసి ఎన్‌సీసీ క్యాడెట్‌ల నుండి గౌరవవందనం స్వీకరించారు. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమర్యాంక్ సాధించడంలో కీలక పాత్రదా ‘సలైన ప్రజారోగ్య, యూజీడీ కార్మికులకు సన్మానం చేశారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

గుంటూరు సిటీ : గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్రవేడులకల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జిల్లా పరిషత్ సీఈవో జే.మోహన్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయం నందు ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పురస్కారాలను అందించారు. ఈ ఏడాది జిల్లా ఉత్తమ అధికారిగా ఎంపికైన జెడ్పీ సీఈవో జే.మోహన్‌రావు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. గుంటూరు లక్ష్మీపురంలోని జిల్లా ల్యాబ్,ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. గుంటూరు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వెంగళరావునగర్‌లోని నగరపాల సంస్థ హైస్కూల్లో జాతీయ జెండాను వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కొంజేటి వెంకట నగేష్ ఆవిష్కరించారు.

గుంటూరు(విద్య) : స్థానిక ఆంధ్రా క్రిస్టియన్ కళాశాల (ఏసీ)లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు. స్థానిక కొరిటిపాడు మెయిన్ రోడ్డు ది విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్‌లో బ్యాంక్ డైరెక్టర్ బీ.వెంకట రమణారావు, జోనల్ మేనేజర్ సిహెచ్ విఆర్ సుబ్రహ్మణ్యం జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. స్థానిక అరండల్ పేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో జేసీ, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజకుమారి గణియా జెండా ఆవిష్కరణ చేశారు. నల్లపాడురోడ్డు, శ్రీలక్ష్మీనగర్ శ్రీపవన్ స్కూల్లో, చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్‌లో వేడుకలు నిర్వహించారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్, మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

గుంటూరు (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రతని బలోపేతం చేసేందుకు ఎవరికి వారు పునరంకితం కావాలని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం. రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దేశ 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నల్లపాడులోని రైల్‌విహార్‌లో ఘనంగా వేడుకలు జరిగాయి. డీఆర్ఎం రామకృష్ణ జాతీయ జెండా ఎగురవేసి ఆర్‌పీఎఫ్ పరేడ్‌ని సందర్శించారు. టీడీపీ గుంటూరు తూర్పు కార్యాలయంలో నసీర్ జాతియ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గుంటూరు: జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కన్నావారితోటని సీజీఎస్‌టీ భవన్‌లో గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. బ్రాడీపేటలో టంగుటూరి ప్రకాశం పంతులు పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గుంటూరు కార్పొరేషన్ డీసీగా వెంకటలక్ష్మి

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 26 : గుంటూరు నగరపాలక సంస్థ నూతన డిప్యూటీ కమిషనర్‌గా డీ. వెంకటలక్ష్మిని నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం జీఎంసీలో డీసీగా పనిచేస్తున్న బీ.శ్రీనివాసరావును బదిలీ చేసి, ఆయన స్థానంలో విజయవాడ డీసీగా విధులు నిర్వహిస్తున్న వెంకటలక్ష్మి గుంటూరుకు బదిలీ చేశారు. శ్రీనివాసరావును సీడీఎంఏకి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పాఠశాల విద్య డైరెక్టర్ పీ.పార్వతి

స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

గుంటూరు(విద్య),జనవరి 26: గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న జిల్లా భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పీ.పార్వతి శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ ట్రూప్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. స్కౌట్స్, గైడ్స్ ద్వారా విద్యార్థులలో నైతిక విలువలు, లౌకికత్వం అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కబ్ విభాగం కమిషనర్ డీఆర్‌కే. శర్మ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కన్నా మాస్టారు

కన్నా స్కూల్లో గణతంత్ర వేడుకలు

గుంటూరు(విద్య),జనవరి 26: స్థానిక రైలుపేటలోని కన్నా స్కూల్‌లో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ కన్నా మాస్టారు మాట్లాడుతూ ప్రతిపౌరుడు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ తన బాధ్యతల్ని, హక్కుల్ని తెలుసుకుని ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు రమేస్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విద్యార్థులతో కేఎల్పీ కార్యదర్శి డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు


రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలి

● కేఎల్పీ స్కూల్ కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్

గుంటూరు(విద్య),జనవరి 26:రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని, స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవాలని కేఎల్‌పీ స్కూల్ కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ విద్యార్థులకు సూచించారు. స్థానిక రింగురోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రధిని చౌదరి, ఏవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కలెక్టర్ నివాసంలో హైటీ

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తన నివాసంలో హైటీ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జీ వైవీఎస్‌బీజీ పార్థసారధి, సీజీఎస్‌టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియా, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్ఎం ఎం రామకృష్ణ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్, డీఆర్వో చంద్రశేఖర్ రావు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



హైటీకి హాజరైన జిల్లా జడ్జీ, వివిధ శాఖల అధికారులు



సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ వెంకటగోపాలకృష్ణ

ఉత్తమ సమాజాన్ని నిర్మించాలి

● ఆర్వీఆర్‌జేసీలో రిపబ్లిక్ డే వేడుకల్లో తహసీల్దార్ వెంకటగోపాలకృష్ణ

గుంటూరు(విద్య),జనవరి26: పౌరుని స్వేచ్ఛకు భంగం వాటిల్లని, ఉత్తమ సమాజ నిర్మాణ కృషిని సాగించినప్పుడే స్వాతంత్ర సమర యోధులకు మనం అందించే ఘననివాళి అవుతుందని తహసీల్దార్ కోటమరాజు వెంకట గోపాలకృష్ణ అన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీలో 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, రాయపాటి గోపాల కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య పోరాట వీరుల వేషధారణలో భాష్యం చిన్నారులు

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

● గణతంత్ర వేడుకల్లో ‘భాష్యం’ చైర్మన్ రామకృష్ణ

గుంటూరు(విద్య),జనవరి 26: త్యాగధనుల పోరాట ఫలితమే స్వాతంత్ర్యమని, వారి స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యసాధన దిశగా కృషిచేయాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మెయిన్ క్యాంపస్ లో జరిగిన గణతంత్ర వేడుకల్లో రామకృష్ణ మాట్లాడుతూ.. ఏ స్థాయికి ఎదిగినా మూలాన్ని మరువకూడదని, తల్లిదండ్రులను, జన్మభూమిని, గురువులతో కృతజ్ఞతతో వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో కనువిందు చేశారు. భాష్యం అన్ని శాఖల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి చారి, జెడ్‌ఈవోలు, ప్రిన్సిపాళ్ళు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

విజ్ఞాన్‌లో వైభవంగా గణతంత్ర వేడుకలు

గుంటూరు(విద్య),జనవరి 26: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం భారత 75వ గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు యుద్ధాల్లో వీర మరణం పొందిన సైనికులకు నివాళిగా ఏర్పాటు చేసిన అమర్ జవాన్ స్థూపానికి నివాళులర్పించి జ్యోతి వెలిగించారు. విద్యార్థులు 100 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీ, ఎన్‌సీసీ పరేడ్ ఎంతగానో ఆకర్షించాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ,రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మువ్వన్నెల జెండాతో విజ్ఞాన్ విద్యార్థుల ర్యాలీ

రైల్వే మెడికల్ హాస్పిటల్లో

డెంటల్ యూనిట్ ప్రారంభం

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్పత్రిలో నూతనంగా డెంటల్ యూనిట్‌ని దక్షిణ మధ్య రైల్వే మహిళ సంక్షేమ సంస్థ గుంటూరు డివిజన్ అధ్యక్షులు ఎం.ఆశలత ప్రారంభించారు. శుక్రవారం ఉదయం డెంటల్ యూనిట్‌తో పాటు డీఫిబ్రిలేటర్, పల్స్ ఆక్సీజన్, రక్తపోటుని నిరంతరం పర్యవేక్షించడానికి కార్డియాక్ మానిటర్, ఔషధాన్ని అందించడానికి ఇన్ఫ్యూజన్ పంప్‌ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశలత మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఆర్ఎం ఎం.రామకృష్ణ, ఏసీఎంఎస్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, డీఎంవో డాక్టర్ ఏ.ప్రియాంక, ఏడీఎంవోలు డాక్టర్ వీ సింథూ, డాక్టర్ మౌనిక, డాక్టర్ ఎం. సాహితి ఇతర అధికారులు పలువురు పాల్గొన్నారు.

గణతంత్ర పురస్కారాల ప్రదానం

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలు, ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురికి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పురస్కారాలను ప్రదానం చేశారు. శుక్రవారం నగరంలోని పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో 75వ గణంతంత్ర దినోత్సవ వేడుకల ముగింపులో పురస్కారాలను అందజేశారు. స్పెషల్ అవార్డుల కేటిగిరీలో ఎన్ సదాశివరావు(నాట్కో ట్రస్టు), బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, ఆర్ రవిచంద్ర, గోపి, బాల భాస్కర్, ఎం శ్రీవాణి(5వ తరగతి విద్యార్థిని, రావెల), బేబి ప్రణీత(7వ తరగతి, ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం స్కూల్), ఎన్ వర్ధిని(9వ తరగతి నారాకోడూరు), పోలి లివిన్(10వ తరగతి, తెనాలి)లకు తొలుత కలెక్టర్ అవార్డులు అందజేశారు. ఎన్‌జీవోల కేటిగిరీ నుంచి పఠాన్ అల్లాభక్షు, నూతలపాటి వీరప్రకాష్, ఎం భానుమతి, కాసుల కృష్ణంరాజు ఉన్నారు. జిల్లా స్థాయి అధికారుల కేటిగిరీలో డీఆర్వో చంద్రశేఖర్‌రావు, గుంటూరు ఆర్‌డీవో శ్రీకర్, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జడ్పీ సీఈవో మోహన్‌రావు, ఆడిట్ అధికారి ధనలక్ష్మి, సీపీడీసీఎల్(సీఆర్‌డీఏ) ఎస్ఈ విజయకుమార్, విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడీ సువార్త, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, ఖజాన శాఖ డీడీ రాజగోపాలరావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఉపాధి కల్పన అధికారి రఘు, ఏపీఎంఐపీ పీడీ ఎల్ వజ్రశ్రీ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జాన్సీలక్ష్మి, సర్వే ఏడీ నాగశేఖర్, పౌరసరఫరాల సంస్థ జీఎం జీ లక్ష్మి, సీపీడీసీఎల్ ఎస్ఈ మురళీకృష్ణయాదవ్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్‌ప్రసాద్, డీఎస్‌వో కోమలి పద్మ, ఇంటర్మీడియట్ విద్య ఆర్‌ఐవీ కే జుబేర్, ఉద్యానవన శాఖ అధికారి బీ రవీంద్రబాబు, డీటీసీ షేక్‌కరీం, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్‌బాషా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్, జ్వరాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, సాంఘిక సంక్షేమశాఖ డీడీ మధుసూదనరావు, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, జౌళి శాఖ ఏడీ వనజలకు కలెక్టర్ అవార్డులు ప్రదానం చేశారు. వీరు కాక మరో 400 మందికి పైగా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులకు కూడా ప్రశంసా పత్రాలను అందించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన మంత్రి రజిని, ఎంపీలు ఎమ్మెల్యేలు

ప్రాపర్టీ షోతో సొంతింటి కల సాకారం

● క్రెడాయ్ మెగా ప్రాపర్టీ షో ప్రారంభం
● హజరైన మంత్రులు రజిని, అంబటి, ఎంపీ, ఎమ్మెల్యేలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 26: క్రెడాయ్ ప్రాపర్టీ షో వల్ల ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన క్రెడాయి మెగా ప్రాపర్టీ షోని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ బ్యాంకర్లు, నిర్మాణదారులు, మెటీరియల్ సప్లయిర్స్ అందరూ ఒకే వేదికపై కలవటం ఎంతో ప్రయోజన కరమన్నారు. ప్రతి సంవత్సరం క్రెడాయ్ ప్రాపర్టీషో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. రాష్ట్ర జలవరల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నిర్వాహకులకు రాష్ట్రప్రభుత్వ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. మేయర్ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఇటువంటి వేదికలు దోహదపడతాయన్నా రు. రాజ్యసభసభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ప్రాపర్టీషో ఏర్పాటు చేసిన క్రెడాయ్ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము మాట్లాడుతూ భవన నిర్మాణాలను అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రెడాయ్‌ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ సొంతింటిని ఏర్పాటుచేసుకునే వారికి ఈప్రాపర్టీషో ఎంతగానో దోహదపడుతుందన్నారు. బ్యాంకర్లు విరివిగా సేవలందిస్తున్నందుకు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, యూపీఐ జోనల్ హెడ్ రవీంద్రబాబు, ఎస్‌బీఐ ఏజీఎం విజయ రాఘవయ్య, క్రెడాయి గుంటూరు చైర్మన్ ఆరు మళ్ళ సతీష్‌రెడ్డి, వైస్ ప్రెసి డెంట్ మెట్టు సాంబశివారెడ్డి, కార్యదర్శి తియ్యగూర వినోద్‌రెడ్డి, శివ నాగే శ్వరరావు, రమాకాంత్, కన్వీనర్ వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బోనా శివనాగబాబు తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.



భారత ప్రభుత్వచట్టం - 1935: దీనిని భారత రాజ్యాంగానికి మాతృకగా చెప్పవచ్చు. ఈ చట్టంలో దాదాపు 70 శాతం అంశాలను భారత రాజ్యాంగంలో చేర్చారు. ఈ చట్టంలో పది షెడ్యూల్స్, 321 అధికరణలు ఉన్నాయి.

ముఖ్యాంశాలు

ప్రభుత్వ పాలనా అంశాలను మూడు జాబితాలుగా విభజించారు. వాటిలో

1) కేంద్ర జాబితా - 59 పాలనా అంశాలు
2) రాష్ట్ర జాబితా - 54 పాలనా అంశాలు
3) ఉమ్మడి జాబితా - 36 పాలనా అంశాలు

- అవశిష్ట అధికారాలు గవర్నర్ జనరల్‌కు లభిస్తాయి. రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తిని కల్పించారు.
- కేంద్రంలో ద్వంద్వ పాలన విధానాన్ని ప్రవేశపెట్టారు.(రాష్ట్రాల్లో ద్వంద్వపాలన రద్దు) రాష్ట్రాల్లో ద్వి శాసనసభా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఢిల్లీలో ఫెడరల్ కోర్టును ఏర్పాటుచేశారు.
- ముంబై కేంద్రంగా ఆర్‌బిఐ(రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా) ఏర్పాటుచేశారు. అలాగే జాతీయస్థాయిలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రస్థాయిలో ప్రొవెన్షియల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటుచేశారు.
- ఇండియా నుంచి బర్మాను వేరు చేశారు. ఎస్సీలకు, క్రిస్టియన్లకు, యురోపియన్లకు, ఆంగ్లో-ఇండియన్‌లకు, కార్మికులకు ప్రత్యేక నియోజకవర్గాలు కొనసాగించారు. మహిళలకు ఓటు హక్కును కల్పించారు.

విమర్శ

1. ఇది బానిసత్వానికి మరోరూపం, భారతీయులపై బలవంతంగా రుద్దారు. గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం లాంటిదని నెహ్రూ అన్నారు.
2. బయటకు ప్రజాస్వామ్య రూపం ఉన్నట్లు కనిపించినా అంతర్గతంగా అంతా శూన్యం. ఇది భారతీయులపై బలవంతంగా రుద్దిన చట్టం అని మదన్ మోహన్ మాలవ్యా పేర్కొన్నారు.
3. ఇది కచ్చితంగా చెడ్డది, పూర్తిగా పిచ్చిది, అయినా అంగీకృతమైందని మహమ్మదాలి జిన్నా పేర్కొన్నారు.
4. ఈ చట్టంతో వైశ్రాయ్‌కి ముస్సోలినీ, హిట్లర్‌ను తలపించే నియంత్రణ అధికారాలను కల్పించారు. ఇది పొట్టి మనుషులు కట్టిన అపురూప కట్టడమని విన్‌స్టన్ చర్చిల్ అన్నారు.
5. మన దేశంలో నూతన బానిసత్వానికి నాంది వంటిది అని నెహ్రూ ఉద్ఘాటించారు.
6. భారత ప్రజలపై బ్రిటిష్ ప్రభుత్వం బలవంతంగా రుద్దిన చట్టమని కె.టి.షా చెప్పారు.

ఆగస్టు ప్రతిపాదన-1940: అప్పటి వైశ్రాయ్ లిన్‌లిత్ గో 1940 ఆగస్టున కొన్ని ప్రతిపాదనలు చేశారు. వాటిలోని ముఖ్యాంశాలు.

- రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఇండియాకి అధినివేశ ప్రతిపత్తి కల్పిస్తారు.
- ప్రాంతీయ ప్రభుత్వాలకు శాసన నిర్మాణ శాఖలు రూపొందించారు.
- ఈ కమిటీ సూచనల మేరకు రాజ్యాంగ నిర్మాణ సభ ఏర్పడింది.

క్రిప్స్ రాయబారం - 1942: రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ సైన్యాల తరఫున భారత సైన్యాలు పాల్గొనాలి. దానికిగానూ

1. రాజ్యాంగ నిర్మాణసభను ఏర్పాటు చేస్తారు.
2. స్వయం ప్రతిపత్తితో కూడిన పాలనా వ్యవస్థను ఇస్తారు.

- ఈ ప్రతిపాదనలను కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తిరస్కరించింది.
- క్రిప్స్ రాయబారాన్ని దివాలా తీసిన బ్యాంకు చెక్కు మీద ముందు తేదీ వేసి ఇచ్చినదిగా గాంధీ అభివర్ణించారు.
- క్రిప్స్ రాయబారాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ బొంబై సమావేశంలో క్విట్ఇండియా తీర్మానాన్ని చేసింది.

క్విట్ ఇండియా ఉద్యమం-1942: బ్రిటిష్ వారు ఇండియాను వదిలివెళ్లాలని డిమాండ్ చేసింది. ఈ ఉద్యమకాలంలో ఇచ్చిన నినాదాలు...

1. డూ (లేదా) డై (విజయమో వీర స్వర్గమో) - గాంధీ
2. క్విట్ ఇండియా - భారత జాతీయ కాంగ్రెస్
3. డివైడ్ - క్విట్ (విభజించండి - వెళ్లిపోండి) - ముస్లిం లీగ్
4. స్ట్రెంథ్ అవర్ ఫోర్స్ అండ్ క్విట్ (మా బలాన్ని పెంచండి, వెళ్లిపోండి)- స్వదేశీ సంస్థానాలు.

సి.ఆర్.ఫార్ములా - 1944: కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల మధ్య ఐక్యత సాధించడం ద్వారా స్వాతంత్ర్య సిద్ధిని పొందవచ్చుననే ఉద్దేశంతో రాజగోపాలచారి ఈ పథకాన్ని రూపొందించారు.

- స్వాతంత్ర్యానంతరం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పాకిస్థాన్ ఏర్పాటు.
- మైనారిటీ ప్రజాభిప్రాయం ద్వారా పాకిస్థాన్ నిర్ణయం జరుగుతుంది.
- దీనిని కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు రెండూ విమర్శించాయి.
- రెండో ప్రపంచయుద్ధం అనంతరం బ్రిటన్‌లో జరిగిన ఎన్నికల్లో లేబర్‌పార్టీ నాయకుడైన క్లెమెంట్ అట్లీ బ్రిటిష్ ప్రధాని అయ్యారు. ఈయన బ్రిటన్ పార్లమెంటులో ఇండియాకు స్వాతంత్ర్యం ఇవ్వబోతున్నామని ప్రకటన చేశారు. అట్లీ మంత్రివర్గంలోని ముగ్గురు సభ్యులను భారతదేశానికి పంపించారు. దీనినే మంత్రి త్రయ రాయబారం అంటారు.

వేవెల్ ప్రణాళిక-1945: నాటి గవర్నర్ జనరల్ దీనిని రూపొందించారు. దేశ సార్వభౌమాధికారం, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, రక్షణ వంటి జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలపై బ్రిటిష్ ప్రభుత్వానికి అధికారం కల్పించి మిగిలిన అంశాలను భారతీయులకు అధికారం ఇవ్వడం. ఇండియాలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఒక యుద్ధ సలహా మండలిని ఏర్పాటు చేయడం. వైశ్రాయ్ కార్యనిర్వాహక వర్గం జాతీయ ప్రభుత్వంగా వ్యవహరిస్తుంది.

సిమ్లా సమావేశం-1945: కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య సయోధ్యను భూలాభాయ్ దేశాయ్, లియాఖత్ అలీఖాన్ మధ్య సామరస్యం కుదర్చడం దీని లక్ష్యం.

- పాకిస్థాన్ ప్రస్తావన లేదని ముస్లింలీగ్, స్వాతంత్ర్యంపై నిర్మాణాత్మక ప్రతిపాదన లేదని కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించాయి.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/CUx7yJలో చదవండి.

ఓయూలో సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జీ రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ)- డిగ్రీ, పీజీ, అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికిగాను 2023-24 సెకండ్ ఫేజ్ (2024 ఫిబ్రవరి అకడమిక్ సెషన్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లను ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తారు. ఇవి రెగ్యులర్ డిగ్రీకి సమానం.

డిగ్రీ: బీఏ, బీఏ(మేథమెటిక్స్&స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ

- **ఎంబీఏ, ఎంసీఏ:** ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. వీటిని ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2023/ఏపీ ఐసెట్ 2023 అర్హత ఉండాలి. లేదంటే 2024 ఫిబ్రవరిలో ఓయూ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.
- **ఎంఏ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. హిందీ, ఉర్దూ స్పెషలైజేషన్‌లకు ఆ మాధ్యమాల్లో పదోతరగతి వరకు చదివి ఉండాలి. లేదంటే డిగ్రీ స్థాయిలో ఆ లాంగ్వేజ్‌ను ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఎంకాం ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **ఎమ్మెస్సీ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. డిగ్రీ(మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు.

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డేటా సైన్స్, అంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. బయోఇన్ఫర్మాటిక్స్‌కు మాత్రం కనీసం 50 శాతం మార్కులతో బీఎస్సీ/ బీఎస్సీ అగ్రికల్చర్/ బీఫార్మసీ/ బీవీఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీఏఎంఎస్/ బీయూఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవాలి.

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: ఇందులో ప్రధాన స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాలి. వేదిక్ ఆస్ట్రాలజీ విభాగంలో డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.

డిప్లొమా: ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. తెలుగు మాధ్యమంలో చదవాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

సర్టిఫికెట్ కోర్సు: స్పెషలైజేషన్ యోగ. ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** osmania.ac.in

ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఎక్స్‌పరిమెంటల్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది మూడు వారాల వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ఎక్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లేస్‌ల విజిట్ కూడా ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మూడు ఫేజ్‌లు ఉంటాయి. మొదటి మూడు వారాలను మొదటి ఫేజ్‌గా; నాలుగు, అయిదు వారాలను రెండో ఫేజ్‌గా; చివరి రెండు వారాలను మూడో ఫేజ్‌గా పరిగణిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా వారాంతాల్లో లైవ్ ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్స్, కేస్ స్టడీ అనాలిసిస్, అసెస్‌మెంట్‌లు ఉంటాయి. మిడిల్/సీనియర్ లెవెల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఎక్స్‌పోర్ట్ సర్వీసెస్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం రిపోర్ట్‌లు సబ్మిట్ చేసినవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.20,000
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 14
- **వెబ్‌సైట్:** iift.ac.in

జేఎన్‌టీయూహెచ్‌లో పీహెచ్‌డీ



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)- పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం(ఎక్స్‌టర్నల్/ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్) కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ, సీఎస్ఐఆర్, డీఎస్‌టీ ఇన్‌స్పయిర్, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందిన వారు; నెట్/జీప్యాట్/ గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న వారు ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ, రీసెర్చ్ పబ్లికేషన్స్ వెయిటేజీ, ప్రపోజ్డ్ రీసెర్చ్ వర్క్ ప్రజంటేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత/జాతీయ పరీక్ష స్కోర్ లేనప్పటికీ యూనివర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాసి ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌లో చేరవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- **ఇంజనీరింగ్:** సివిల్, మెకానికల్, మెటలర్జికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** బయోటెక్నాలజీ, కెమికల్ సైన్సెస్-కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, వాటర్ రిసోర్సెస్ & ఎర్త్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్.
- **మేనేజ్‌మెంట్ సైన్స్:** మేనేజ్‌మెంట్
- ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ కేటగిరీలో మేథమెటిక్స్, ఫిజిక్స్, ఫైనాన్స్ స్పెషలైజేషన్‌లు కూడా ఉన్నాయి.

అర్హత వివరాలు: ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లకు సంబంధిత బ్రాంచ్‌లో బీఈ/బీటెక్/ఏఎంఐఈతో పాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లకు సంబంధిత సబ్జెక్టులతో ఎమ్మెస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు బీఫార్మసీతోపాటు ఎంఫార్మసీ/ఫార్మాడీ పూర్తి చేసి ఉండాలి. మేనేజ్‌మెంట్ విభాగానికి ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులందరికీ పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు.

- **దరఖాస్తు ఫీజు:** ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు రూ.1500; ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌నకు రూ.1000; ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌నకు రూ.5000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

నవ్య | చిత్రజ్యోతి

అభినందనల వెల్లువలో తడిసి ముద్దయిన అంజనీపుత్రుడు

పద్మవిభూషణుడిపై అభినందనల కుంభవృష్టి కురిసింది. అభిమానులు, ఆత్మబంధువులతో మెగా నివాసం కిటకిటలాడింది. సినీ రాజకీయ ప్రముఖులతోపాటు బంధు, మిత్ర, సపరివారమంతా అభినందన చందనాలతో మెగాస్టార్‌ని అభిషేకించింది. భారతరత్నకు ఒక్కడుగు దూరంలోనే ఉన్న అంజనీపుత్రుడు ఆనందాతిశయాలతో కళకళలాడిపోయారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అగ్రనిర్మాత దిల్‌రాజుతో సహా మెగా నివాసానికి వచ్చి చిరంజీవికి శుభాభినందనలు అందించారు. నేరుగా వందలాది మంది ఆయన్ను అభినందిస్తే.. మీడియా, సాంఘికమాధ్యమాల ద్వారా లక్షలాదిమంది మెగాస్టార్‌కి జేజేలు పలికారు.



విశ్వంభరతో విజయ పరంపర కొనసాగించాలి

కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డులకు ఎంపికైన వారికి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చిరంజీవి నివాసానికి నిర్మాత దిల్ రాజుతో కలిసి వెళ్లి శాలువాతో సన్మానించారు. అనంతరం మెగాస్టార్‌తో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పునాదిరాళ్లు సినిమాతో చిరంజీవి తన ప్రస్థానాన్ని ప్రారంభించారని, త్వరలో విడుదల కాబోయే విశ్వంభరతో విజయ పరంపర కొనసాగిస్తారన్నారు. రక్తదానం, నేత్రదానం ద్వారా కోట్లాది మంది గుండెల్లో మెగాస్టార్ చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రశంసించారు.



నాకు దక్కిన ప్రతి గౌరవం అభిమానులదే

- చిరంజీవి

దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారానికి నేను ఎంపికయ్యానని తెలిసినప్పుడు ఏం మాట్లాడాలో, ఎలా స్పందించాలో అర్థంకాలేదు. షాక్‌లో ఉండిపోయాను. నిజంగా చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఈ గౌరవానికి కారణం నా అభిమానులే. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా.. నన్ను అన్నలా, బిడ్డలా, సొంత మనిషిగా భావించే కోట్లాది మంది అభిమానులు నాకు ఉండటం నా పూర్వజన్మ సుకృతం. నీడలా నాతో నడిచే కోట్లాది అభిమానుల ప్రేమ, ఆదరణ.. నా సినీకుటుంబం అండదండలు ఈ రోజు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయి. నాకు దక్కిన ప్రతి గౌరవం వారిదే. 45ఏళ్ల సినీ ప్రయాణంలో విభిన్నమైన పాత్రల ద్వారా వినోదం పంచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉన్నాను. నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన సమాజం కోసం ఎంతోకొంత చేయాలనే తాపత్రయం నాకెప్పుడూ ఉంటూనేవుంది. అందుకే సేవ చేసి రుణం తీర్చుకుంటున్నాను. వాళ్లిస్తున్న దానితో పోలిస్తే నేను చేస్తున్నది గోరంతే. ఈ నిజం ప్రతిక్షణం నాకు గుర్తొస్తూనేవుంటుంది. అదే నన్ను బాధ్యతగా ముందుకు నడిపిస్తూవుంది. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి నన్ను ఎంపికచేసిన భారతప్రభుత్వానికీ, ప్రధాని నరేంద్రమోడీగారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

తండ్రిగా మీ పాత్ర ఓ అద్భుతం


భారతీయ సినిమాపై ముద్ర.. అసంఖ్యాక అభిమానులను ప్రేరేపించడంలో మీపాత్ర అనితరసాధ్యమైనది. ఓ బాధ్యతగల పౌరునిగా నన్ను తీర్చిదిద్దడంలో తండ్రిగా మీ పాత్ర ఓ అద్భుతం. పవిత్రమైన నాదేశ నిష్కళంక పౌరులు మీరు. మిమ్మల్ని ఈ స్థాయిలో గుర్తించిన భారతప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- రామ్‌చరణ్

గీతా ఆర్ట్స్‌లో మరోసారి బోయపాటి

కొన్ని కాంబినేషన్స్ గురించి వినగానే బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అనిపిస్తుంది. అచ్చం అలాంటి కాంబినేషనే దర్శకుడు బోయపాటి శ్రీను, అగ్ర నిర్మాత, గీతా ఆర్ట్స్ అధినేత అల్లు అరవింద్‌లది. వీరిద్దరి కలయికలో అల్లు అర్జున్ హీరోగా 2016లో 'సరైనోడు' చిత్రం వచ్చిన సంగతి విదితమే. మాసివ్ బ్లాక్‌బస్టర్‌గా ఆ చిత్రం నిలిచి అత్యధిక వసూళ్లు సాధించింది. ఇప్పుడు మళ్లీ బోయపాటి దర్శకత్వంలోనే మరో చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు అరవింద్. అయితే ఇందులో హీరో ఎవరన్నది త్వరలో ప్రకటిస్తారు. వైవిధ్యమైన వాణిజ్య కథాంశాలను అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించి ఎన్నో విజయాలు సొంతం చేసుకున్న అల్లు అరవింద్ మరో హిట్ సినిమా తీయాలనే తపనతో ఈ చిత్ర నిర్మాణ సన్నాహాలు ప్రారంభించారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరికొన్ని వివరాలు తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు.






విభిన్న కోణాల్లో మాస్ మహారాజా

గణతంత్రదినోత్సవ సందర్భంగా రవితేజ నటించిన రెండు సినిమాలకు చెందిన ప్రమోషన్స్ విడుదలయ్యాయి. ఈ రెండు సినిమాల్లో ఒకటి హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్'కాగా, రెండోది కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొంది, ఫిబ్రవరి 9న విడుదల కానున్న 'ఈగల్'. ఈ రెండు సినిమాలకూ నిర్మాత ఒకరే కావడం విశేషం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ ఈ చిత్రాలను నిరిస్తున్నారు. ఇక 'మిస్టర్ బచ్చన్' విషయానికొస్తే.. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేయగా, ఆ పోస్టర్‌లో రవితేజా బ్లూ షర్ట్, బ్యాగీ ప్యాంట్లో వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నారు. రవితేజతో పాటు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్న బిల్డింగులు, కార్లు ఎయిటీస్, నైన్‌టీస్ నాటి వాతావరణాన్ని తలపిస్తున్నాయి. 'నామ్ తో సనా హోగా' అనే ట్యాగ్‌తో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్'లో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. షూటింగ్ ప్రస్తుతం కారంపూడిలో జరుగుతోంది. మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్. 'ఈగల్' విషయానికొస్తే.. దావ్‌జాండ్ స్వరపరిచిన 'ఈగల్స్ ఆన్ హిస్ వే..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రవితేజ పోషిస్తున్న సహదేవ్ పాత్ర వైల్డ్ నేచర్‌ని పాట రాసిన జార్జినా మాథ్యూ సాహిత్యం అద్దంపడుతోంది. తనే స్వయంగా ఆలపించడం విశేషం. ఈ పాట విజువల్స్ రవితేజ కిల్లర్ అవతార్‌ని చూపిస్తున్నాయి. రవితేజ విభిన్న కోణాలున్న పాత్రను ఇందులో పోషించారని దర్శకుడు చెబుతున్నారు. అనుపమ పరమేశ్వరన్, కావ్య థాపర్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రంలో నవదీప్, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు.

దోచుకోవడానికి వస్తున్న నితిన్

'డబ్బు చాలా చెడ్డది. రూపాయి రూపాయి నువ్ ఏం చేస్తావ్ అంటే అన్నదమ్ముల మధ్య, అక్క చెల్లెళ్ల మధ్య చిచ్చు పెడతాను అంటది. అన్నట్లే చేసింది. దేశమంత కుటుంబం నాది. ఆస్తులున్నోళ్లంతా నా అన్నదమ్ములు, ఆభరణాలేసుకున్నోళ్లంతా నా అక్కా చెల్లెళ్లు. అవసరం కొద్దీ వాళ్ల జేబుల్లో చేతులు పెడితే, ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు. అయినా నేను హర్ట్ అవడం లేదు. ఎందుకంటే అయినవాళ్ల దగ్గర డబ్బులు తీయడం నా హక్కు. మై బేసిక్ రైట్. బికాజ్ ఇండియా ఈజ్ మై కంట్రీ. ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్..' ఈ హ్యూమరెస్ డైలాగ్ చెబుతున్నది ఎవరో తెలుసా.. నితిన్. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న భారీ చిత్రంలో నితిన్ ఇలా దొంగ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు 'రాబిన్‌హుడ్' అనే టైటిల్ పెట్టినట్లు దర్శకనిర్మాతలు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. నితిన్, వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సినిమాలో నితిన్ గెటప్, నటన ఎంటర్‌టైనింగ్ గా ఉంటాయని దర్శకుడు చెప్పారు. సరికొత్త పాత్రలో ఆయన్ని ప్రజెంట్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, కళ: రామ్ కుమార్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Hbk8jFH లో చదవండి.

వైభవంగా గణతంత్ర దినోత్సవం

75 మీటర్ల పతాకంతో వెస్ట్‌బెర్రీ విద్యార్థుల ర్యాలీ



75 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న వెస్ట్‌బెర్రీ విద్యార్థులు

తెనాలి అర్బన్, జనవరి 26: పట్టణంలో గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పలు సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేసి గౌరవ వందనం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని సందేశం ఇచ్చారు. ఎందరో త్యాగంతో వచ్చిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని, రాజ్యాంగాన్ని అందించిన మహనీయులను నిత్యం స్మరించాలని చెప్పారు. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ జస్వంత రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. వివిధ శాఖల్లో విశిష్ట సేవలు అందించిన సిబ్బంది, సచివాలయ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు 75 మీటర్ల జాతీయ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. రజక చెరువు సెంటర్



మున్సిపల్ కార్యాలయంలో రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్, కౌన్సిలర్లు

నుంచి మార్కెట్ వరకు చేసిన ర్యాలీలో భారీ పతకం పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. టూటౌన్ సీఐ వెంకట్రావు ర్యాలీని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఏవో ఆదినారాయణ, శ్రీనివాస్, వెంకటనారాయణ, భాను ప్రియ, దివ్య, నాగజ్యోతి పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్ జాతీయ పతకాన్ని ఎగురవేశారు. రెవెన్యూ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. బీజేపీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో జాతీయ జెండా ఎగుర వేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు, విజయలక్ష్మి, కనకదుర్గా, ప్రశాంతి, సాయిగుప్తా, కుశల్‌రాజ్‌జైన్ పాల్గొన్నారు. ఎస్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో కమిటీ కోశాధికారి రావూరి సుబ్బారావు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యదర్శి గుగ్గిరం రామమోహనరావు, బదరినాథ్ గుప్తా, ప్రిన్సిపల్ విజయకృష్ణ, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు. చంద్రకళ పిజీ కళాశాలలో కమిటీ అధ్యక్షుడు నంబూరు వెంకటకృష్ణమూర్తి జాతీయ జెండా ఎగుర వేశారు. మాజీ ఎంపీపీ బొలిశెట్టి ప్రభాకరరావు, ప్రిన్సిపల్ నరేష్ పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులకు పాల్ అండ్ లూక్ మినిస్ట్రీ డైరెక్టర్ బ్రదర్ ఆనందన్న స్వీట్లు పంపిణీ చేశారు. సరస్వతీ శిశుమందిర్‌లో కమిటీ అధ్యక్షుడు సామల లక్ష్మణబాబు రిపబ్లిక్ దినోత్సవ ప్రాధాన్యత వివరించారు. కోడూరి రమాదేవి, నాగేంద్ర, శివప్రసాద్, సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు జెండా ఎగురవేసి వందనం చేశారు. పార్టీ నాయకులు పి.శశి, బుల్లియ్య, సాంబయ్య, మల్లికార్జునరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్, చేబ్రోలు: పొన్నూరు, చేబ్రోలు మండలంలో 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని గోళ్లమూడిపాడులో నాట్కో స్కూల్ ఆఫ్ లెర్నింగ్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలో తహసీల్దార్ శ్రీకాంత్ ఖేదార్నాథ్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్య, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేషనల్ యూత్ పార్లమెంట్ నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షిమ్నీ జాయ్, కో ఆర్డినేటర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూత్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు రాజ్యాంగం పరిచయంచేసి ప్రాథమిక హక్కులను ఎద్దు రత్నరాజు తదితరులు అవగాహన కల్పించారు. చేబ్రోలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలో గణతంత్ర వేడుకలు జరిగాయి.

● పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థాన కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి ఆవిష్కరణ చేసి వందన సమర్పణ చేశారు. ధర్మకర్త మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర్ రావు, ధర్మకర్తల మండలి సభ్యులు కొమ్మూరి శివరత్నాలు, కారంకి శివ నాగేశ్వరమ్మ, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మల వెంకట్రావు, దేవస్థాన అర్చక స్వాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● పెదకాకాని: ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశ ప్రజాస్వామ్యం ఎంతో ప్రత్యేకమైనదని అది నిరంతరం కొనసాగాలని అందుకు నేటి తరం విద్యార్థులు కృషిచేయాలని ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం యూనివర్సిటీలో 75వ గణతంత్ర దినోత్సవాలు జరిగాయి. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వీసీ వర్సిటీ కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు. రెక్టర్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి భారతదేశం వికసిక్ భారత్‌గా ఎదుగుతుందని అందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ మాట్లాడుతూ భారతదేశం ఇతర దేశాలకు ప్రజాస్వామ్యం దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ వేడుకలకు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య అధ్యక్షత వహించారు. వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, కోఆర్డినేటర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● పెదకాకాని: స్వాతంత్ర సమరయోధుల జీవితం నేటి యువతకు ఆదర్శమని తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఘనంగా గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎస్ విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్రఉద్యమంలో ఎందరో మహానుభావులు ప్రాణాలు అర్పించారన్నారు. వారందరి త్యాగఫలాలను నేడు మనం అనుభవిస్తున్నామన్నారు. అటువంటి మహనీయులను గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ తోట కృష్ణమోహన్, డాక్టర్ మన్నేప్రకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● పెదకాకాని: మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మండల పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జెండా వందనం కార్యక్రమం



జెండా వందనం చేస్తున్న సబ్ కలెక్టర్ ప్రకార్‌జైన్

నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి మండలం ప్రధాన కార్యదర్శి తాళ్ళ శ్రీనివాసరావు నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ ఆవిష్కరించారు. పార్టీ జెండాను కుక్కల మల్లికార్జునరావు ఆవిష్కరించారు.

● తెనాలి రూరల్: రిపబ్లిక్ డేను నియోజవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావులు, పార్టీ శ్రేణులతో కలిసి జెండా ఎగురవేసి రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దివి అనిత, బోయపాటి అరుణ, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, అన్నం పిన్నారావు, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, జొన్నాదుల మహేష్, డాక్టర్ ఆవుల చక్రవర్తి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, గిరి గణేష్, ఫణిదపు దుర్గ, పరుచూరి రమ్య, కొండా రమాదేవి, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, అశోక వసంతం, కఠెవరం గిరి, గుమ్మడి ప్రసాద్, మునిపల్లి దుర్గ, సుదామాధవి, కామేశ్వరి, గోళ్ళమూడి వెంకటేశ్వరరావు, వెంకయ్య చౌదరి, జయరామకృష్ణ, మల్లవరపు విజయ్‌కుమార్, రామకృష్ణ పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కాలేజ్‌లో విద్యార్థుల ప్రదర్శన

● పట్టణంలోని జేఎంజే మహిళా కళాశాల్లో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ జెండాను ఆవిష్కరించి రిపబ్లిక్ డే గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

● వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో రిపబ్లిక్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, వీఎస్ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, ఎన్వీఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వి.అజయ్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరించారు. విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెనాలి క్రైం: రాజకీయాల్లో సామాన్య ప్రజల భాగస్వామ్యం పెరిగేలా సరికొత్త రాజకీయ మార్పుకోసం ప్రజలు వేచి చూస్తున్నారని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ రాజకీయాల్లో డబ్బు, అధికారం, అహంకారం తగ్గాలన్నారు.

● కొల్లిపర: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యా సంస్థల్లో జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నాంచారయ్య, సచివాలయాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రవీంద్రరెడ్డి, వ్యవసాయకార్యాలయంలో ఏడీఏ వెంకట్రావులు పతాకావిష్కరణ చేయగా ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకర్‌రావు, పరిపాలనాధికారి చంద్రమోహన్, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఏఎన్‌యూలో జెండా వందనం చేస్తున్న వీసీ రాజశేఖర్, ఇతర అధికారులు



నాట్కోలో విద్యార్థుల వందనం స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్ ఖేదార్నాథ్



జాతీయ జెండాను ఎగురవేస్తున్న నాదెండ్ల



పిడపర్తిపాలెంలో మాజీ మంత్రి ఆలపాటి చేస్తున్న పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎంపీ నారాయణ, టీడీపీ అధికార ప్రతినిధి మాణిక్యరావు

వైసీపీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, జనవరి 26: పేదప్రజలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని గొప్పగా చెప్పిన జగన్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మాజీమంత్రి ఆలపాటి తలపెట్టిన ప్రజాయాత్ర 15వ రోజుకు చేరుకుంది. శుక్రవారం మండల పరిధిలోని గుడిబండివారిపాలెం, పిడపర్తిపాలెం, పిడపర్రు, చివలూరు గ్రామాల్లో రాజేంద్రప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. పాదయాత్రలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆలపాటి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అబద్ధపు మాటలతో, మోసపూరిత వాగ్ధానాలతో అలవికాని హామీలతో రాష్ట్ర ప్రజలను వంచనచేసి అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. పాదయాత్రలో జగన్ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని అధికారం చేపట్టిన తర్వాత ఆ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పేదలకు సంక్షేమం అందిస్తున్నామని ప్రచారం చేస్తున్న జగన్ ఆ సంక్షేమం పేరుతో ఎన్ని కుటుంబాల్లో వెలుగులు నింపారో చెప్పాలన్నారు. నిత్యావసర ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయని పేదప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు రాష్ట్రంలో అన్నివర్గాల పేదప్రజలకు సామాజికంగా, ఆర్థికంగా న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ళ వీరారెడ్డి, జి.గోవర్ధనరెడ్డి, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, దాసరి నరసయ్య, ఆళ్ళ సురేష్‌రెడ్డి, తూమాటి రాజశేఖర్, వేమూరి మోహన్‌బాబు, పిల్లి సునీల్, పి.శేషగిరి, కె.పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌గా శ్రీకాంత్ ఖేదార్నాద్



ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్ ఖేదార్నాద్

పొన్నూరు టౌన్, జనవరి 26: 75వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా పొన్నూరు తహసీల్దార్ ఎస్.శ్రీకాంత్ ఖేదార్నాద్ ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. శుక్రవారం గుంటూరులో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తహసీల్దార్ శ్రీకాంత్ ఖేదార్నాద్‌కు ప్రసంశాపత్రం అందచేసి అభినందించారు.

ట్రాన్స్‌కో ఈఈ చిరంజీవికి అవార్డు

తెనాలి అర్బన్, జనవరి 26: ట్రాన్స్ కో డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవికి రిపబ్లిక్ డే అవార్డు లభించింది. ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జయభారతరావు చేతుల మీదుగా శుక్రవారం జరిగిన రిపబ్లిక్ వేడుకల్లో అవార్డు అందుకున్నారు. తెనాలి డివిజన్‌లో విద్యుత్ సరఫరా, నిర్వహణలో ఆయన అందించిన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డు పొందిన ఆయనను విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది అభినందించారు.

పెన్షనర్ల సమస్యలపై పోరాడతాం

● పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణమూర్తి

తెనాలి రూరల్, జనవరి 26: పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై అసోసియేషన్ తరపున అలుపెరగని పోరాటంచేస్తామని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో దివంగత బొమ్మదేవర వెంకటేశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో నూతనంగా ఏర్పాటుచేసిన లిఫ్టను సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి సూర్యప్రకాశరావు, సోమయ్య శాస్త్రి, పినపాటి రవికుమార్, గరికపాటి సుబ్బారావు, శంకర్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ పట్టణ నాయకులతో అత్యవసర సమావేశం

తెనాలి రూరల్, జనవరి 26: పట్టణంలోని అన్ని వార్డుల టీడీపీ శ్రేణులతో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం 10.30గంటలకు కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశానికి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారన్నారు. తెనాలి పట్టణంలోని అన్ని వార్డుల ప్రెసిడెంట్లు, వార్డు ఇంచార్జ్‌లు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులందరూ పాల్గొనాలని హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి: కేసన

తెనాలి అర్బన్, జనవరి 26: రాజ్యాంగంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. చినరావూరు పార్కు వాకర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో దేశాలను పరిశీలించి బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అందించారని చెప్పారు. క్విజ్ పోటీల్లో విజేతలు ఎన్నారై కళాశాల, వైష్ణవి జూనియర్ కళాశాల, వెస్ట్‌బెర్రీ స్కూల్ విద్యార్థులకు మొదటి మూడు బహుమతుల కింద రూ.10వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో ముత్తేవి రవీంద్రనాథ్, అప్పారావు, నరసింహారావు, కొత్తమాసు కుమార్, వెలువోలు ఇందిర, కౌన్సిలర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

తెనాలి అర్బన్, జనవరి 26: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. పెరుగు మార్కెట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎం.కుటుంబరావు, సుబ్రహ్మణ్యం, రమేష్‌కృష్ణ, సాంబశివరావు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

పొన్నూరు టౌన్, జనవరి 26: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళలను అరెస్టు చేసినట్లు అర్బన్ ఎస్సై బి రామబ్రహ్మం తెలిపారు. వీవర్స్ కాలనీ వద్ద మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం సోదాలు నిర్వహించగా జొన్నదుల దుర్గా భవానీ అనే మహిళలను అదుపులోకి తీసుకొని 7 మద్య బాటిలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామబ్రహ్మం తెలిపారు.

ఆర్యవైశ్య మహాసభ ఈసీ మెంబర్‌గా బాపనపల్లి

పొన్నూరు టౌన్, జనవరి 26: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పొన్నూరు పట్టణానికి చెందిన బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు శుక్రవారం నియమితులైయ్యారు. ఈ సందర్భంగా బాపనపల్లితో మహాసభ అధ్యక్షుడు రామ సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించి అభినందించారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిరంజీవి అభిమానుల సంబరాలు

పొన్నూరు టౌన్, జనవరి 26: దేశం ఉన్నత పురస్కారం పద్మవిభూషణ్ అవార్డును సినీ నటుడు చిరంజీవికి లభించటంపై శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి అభిమానులు పట్టణంలో సంబరాలు నిర్వహించారు. తెలగపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నంనాడు ఆధ్వర్యంలో కేక్‌ను కోసి బాణసంచా పేల్చి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానుల సంఘం నాయకులు కొత్త శ్రీనివాసరావు, మిరియాల చంద్రకాత్, తోట నాగరాజు, గమిడి కృష్ణ తదితరులతోపాటు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కర్నాటకలో అర్చకుల జీతాలు రికవరీ తగదు: గోపాలకృష్ణ

తెనాలి రూరల్, జనవరి 26: ఆలయాల్లో పనిచేసే అర్చకుల జీతాల రికవరీ చర్యలు కర్నాటక ప్రభుత్వం పైశాచికత్వానికి పరాకాష్టగా ఉందని దక్షిణ భారత అర్చక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.ఎస్.గోపాలకృష్ణ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన తెనాలిలో మీడియాతో మాట్లాడుతూ ఆలయాలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న అర్చకులకు చేతనైనసాయం అందించాల్సిన ప్రభుత్వం జీతాలను తిరిగి ఇవ్వమని కోరటం అనాలోచిత నిర్ణయమని పేర్కొన్నారు. అనాదిగా ఆధ్యాత్మిక సంపదను, ఆర్ష సంప్రదాయాల పరిరక్షణకు దీక్ష బద్ధులైన అర్చకులను పాలకులు విస్మరించరాదన్నారు. ధార్మిక సంస్థల జోలికి వస్తే ప్రభుత్వాల పతనం ఖాయమని గోపాలకృష్ణ హెచ్చరించారు.

పాడిరైతుల అభ్యున్నతి కోసం సంగం డెయిరీ కృషి

ఎండీ గోపాలకృష్ణన్

చేబ్రోలు, జనవరి 26: పాడి రైతుల అభ్యున్నతి కోసం సంగం పాలకవర్గం చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ నిరంతరం పాటుపడుతున్నారన్ని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గోపాళ్ల కృష్ణన్ అన్నారు. సంగం డెయిరీ అవరణలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. జాతీయ పతాకాని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా పలువురు పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ సంగం డెయిరీ ప్రగతిపథాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎండీ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ సంగం డెయిరీ సమకూర్చుకున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలిపారు. కార్యక్రమంలో సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సంగం డెయిరీ ఆవరణలో జాతీయ పతాకానికి వందన సమర్పణ చేస్తున్న ఎండీ గోపాలకృష్ణన్ తదితరులు



యాత్రను ప్రారంభిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

తెలుగు యువత ఆధ్వర్యంలో ప్రచార యాత్ర

పొన్నూరు టౌన్, జనవరి 26: తెలుగు యువత ఆధ్వర్యంలో శుక్రవారం పొన్నూరు పట్టణ, మండలంలో ద్విచక్ర వాహన ప్రచార యాత్ర జరిగింది. ప్రధానంగా ఈ నెల 29వ తేదీన చేబ్రోలు మండలం వడ్లమూడిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్వహించే రా కదలిరా భారీ బహిరంగ సభకు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరుతూ ఈ యాత్రను తరలించారు. తెలుగు యువత అధ్యక్షుడు ముప్వ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మండల పరిధిలో వెల్లలూరు నుంచి జరిగిన యాత్రలో మాజీఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ప్రారంభించారు. మండల పరిధిలోని 29గ్రామాలు పట్టణంలోని 31వ వార్డులో ఈ ద్విచక్రవాహన యాత్ర సాగింది. వందలాది మంది టీడీపీ యువత ఈ ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్ని గ్రామ గ్రామాన, పట్టణంలోని వార్డులో పర్యటించి ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఈ యాత్ర ద్వారా ప్రచారం చేశారు.



నిడుబ్రోలులో సమావేశమైన వైసీపీ అసంతృప్త నేతలు

కిలారిని గెలిపిస్తే బుద్ధి చెప్పాడు

● వైసీపీ అసంతృప్త నేతలు, కార్యకర్తలు

పొన్నూరు టౌన్, జనవరి 26: చివరి నిమిషంలో అధిష్టానం పొన్నూరు పంపిన ఎమ్మెల్యే కిలారిని గెలిపిస్తే తగురీతిలో బుద్ధి చెప్పాడని వైసీపీ అసంతృప్త కార్యకర్తలు వాపోయారు. శుక్రవారం పట్టణంలోని నిడుబ్రోలులో వైసీపీ అసమతి వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పట్టణ, మండలానికి చెందిన 150మంది నాయకులు, కార్యకర్తలు హాజరైయ్యారు. పలువురు కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ అధిష్టాన నిర్ణయాన్ని గౌరవించి గత ఎన్నికలలో చివరి నిమిషంలో పొన్నూరు టికెట్ దక్కించుకున్న కిలారి వెంకటరోశయ్య కోసం పనిచేసి గెలిపించామన్నారు. ఐతే గెలిచిన నాటి నుంచి తమపై చులకనభావం చూపి పార్టీకి దూరంగా ఉంచారన్నారు. కేవలం రావి వెంకటరమణ మద్దతుదారులుగా ముద్రపడినందువల్లనే ఈ చర్యలకు పూనుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే టికెట్ కిలారి రోశయ్యకు ఇచ్చినా లేదా వేరే కొత్తవారికి ఇచ్చినా పార్టీకి పనిచేసేది లేదని తేల్చిచెప్పారు. అంతేకాకుండా రావి వెంకటరమణపై సస్పెన్షన్ ఎత్తివేసి పొన్నూరుకు ఇన్‌చార్జిగా నియమించాలని సమావేశంలో డిమాండ్ చేశారు. త్వరలో ప్రకటించనున్న ఐదో లిస్ట్‌లో రావి వెంకటరమణ పేరు ప్రకటించాలని డిమాండ్ చేశారు.



వివాలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ విద్యాసాగర్

ఘనంగా వివా పాఠశాల వార్షికోత్సవం

పెదకాకాని, జనవరి 26: వివా ది స్కూల్ ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు 10వ ఆంధ్రగల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, వివా వీవీఐటీ విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పాఠశాలలోని వివా, వీవీఐటీ ఎన్.సి.సి. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలలో విద్యార్థులకు క్రీడ, సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహించి ప్రశంశాపత్రాలను అందించారు. అనంతరం వివా పాఠశాల వార్షికోత్సవ వేడుకలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. వార్షికోత్సవ వేడుకలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, అధునిక నృత్యాలు, అలరించాయి. విద్యార్థులు ప్రదర్శించిన సందేశాత్మక లఘు నాటిక 'నాన్న నాతో ఉంటావా', సైన్స్ ఎగ్జిబిషన్, చిత్రకళలు ఆకట్టుకున్నాయి. పాఠశాల వార్షిక ప్రణాళికను డైరెక్టర్ ఎల్.కమాండర్ కె.శ్రీనివాసరావు ప్రకటించారు. ముఖ్యఅతిథి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, మామిళ్లపల్లి వేదవాణి, వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కేఎస్.రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం సంధానర్త కె.మాధవి, సీబీఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, సీనియర్ సెకండరీ సంధానకర్త లక్ష్మిభాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.